# 35. ఎద్దు తలకాయల కళ

"అసలు 'ఆర్ట్' అంటే ఏమిటి సార్?" అనడిగేడో పత్రికా విలేఖరి ఆర్ట్ ఎగ్జిబిషన్లో కలిసి!

సదరు ఆర్టెగ్జిబిషన్లో ఖరీదయిన కళాఖండాలెన్నో వున్నాయి. కొన్నింటికి గోల్డు, సిల్వర్ మెడళ్లు వస్తే, కొన్నింటికి అయిదేసివందల రూపాయల కాష్ బహుమతులొచ్చాయి.

'నాయనా: మనం ఇప్పుడున్నదే ఆర్టు మధ్య. మన చుట్టూ ఉన్న ఇవన్నీ కళాఖండాలని పిలువబడుతాయి. ఆర్టంటే ఇదే." అన్నాన్నేను ఆ అమాయకుడితో.

'అలాగా, సార్! అయితే ఆర్ట్ అంటే ఇదేనన్న మాట! కానీ, సార్, నాకో సందేహం! ఇంతకీ ఆర్ట్ అనేది వున్నది ఈ బొమ్మల్లోనా? లేక వాటి ఫ్రేముల్లోనా?" అనడిగేడతను మరింత అమాయకంగా!

నేను ఆలోచనలో పడిన మాట నిజం, ఆర్ట్ క్రిటిక్ అని నాకున్న బిరుదును ఎవరేనా ఊడపీక్కుపోతారనే భయం ఉన్నా ఈ నిజం ఒప్పుకోవాల్సిందే! కొంత కాలంనుంచీ ఆర్ట్ ఎగ్జిబిషన్లు చూస్తూంటే అడపా దడపా నాకి అనుమానం

వస్తూనే వుంటోంది. కొందరు ఫ్రేములు తయారుచేసే కార్పెంటర్ కళాకారుల్ని గురించి వాకబు చేయకుండా వుండలేక పోయాను కూడా.

వెనకో గొప్ప చిత్రకారుడు తన బొమ్మల ప్రదర్శనం బ్రహ్మాండంగా ఏర్పాటుచేసి గవర్నరుచేత ఘనంగా ప్రారంభోత్సవం చేయించాట్ట. ఆతర్వాత గవర్నరుగారికో "మాస్టర్ పీస్"ను బహుకరించాట్ట. అది జరిగిన నెల రోజులకు గవర్నరు గారి సెక్రటరీ ఆర్టిస్టుకు అఫీషియల్‌గా థాంక్స్ తెలుపుతూ, "మీ అమూల్యమైన కళాఖండం గవర్నరుగారి ప్రైవేట్ రూంలో ప్రముఖంగా వ్రేలాడ దీయబడినదని తెలుపుటకు సంతసించుచున్నాను" అని రాశాట్ట.

అందుకు మన చిత్రకారుడు పొంగిపోయి ఓ రోజు చూసి వద్దామని వెళ్లాట్ట. తీరా చూస్తే తన పెయింటింగుకు బదులు కీర్తిశేషురాలైన గవర్నరుగారి తల్లి ఫోటో ఉందట అక్కడ. "ఇదేమిటి సార్?" అని సెక్రటరీనడిగితే "అవునూ! ఆ ఫ్రేం మీదే గదా" అన్నాట్ట ఆ కళాభిమాని.

ఈ కథ నా మిత్రుడికి వివరించేను. "అయ్యా! ఈ నాడు మన కళను గురించి సాధికారంగా చెప్పగల వాళ్ళు గవర్నర్లూ, మంత్రులూ, వారి సెక్రటరీలూ మాత్రమే. కనుక సదరు గవర్నర్ సెక్రటరీ నిర్ణయం ప్రకారం చూస్తే ఫ్రేముల్ని అంత తేలిగ్గా తీసెయ్యలేం గదా!" అన్నాను.

విలేఖరుడు తలూపేడు. “సరే గానీ, సార్! లలిత కళలు అంటే అర్థం ఏమిటి?” అనడిగేడు

“మనువో, మరెవరో గానీ రాసేరు, చతుష్షష్టి కళలున్నాయని! వారి లెక్క ప్రకారం కన్నపు దొంగతనాలు, జేబులు కొట్టటం, ఖూనీలు చేయటం, పేడపిసకటం, పిడకలు చెయ్యటం లాంటివన్నీ లలిత కళలే.”

“ఎవడండీ, ఆ రాసిన వాడు? మనం లలితకళా అకాడమీలు పెట్టుకుంటామని తెలిసే రాశాడా అలాగా?”

“వాడు చచ్చి చాలా కాలం అయిందిలే! సాహిత్య అకాడమీని అడిగితే అడ్రసు దొరకొచ్చు. వాళ్ల బీరువాల్లో అతని పుస్తకాలు కూడా ఉండొచ్చు!”

విలేఖరుడు ఆలోచనలో పడ్డాడు “ఒకటి కావచ్చునండీ. లలిత కళా అకాడమీలయినా, మోటు కళా అకాడమీలయినా చేసే ఘనకార్యం ఆశ్రితుల జేబులు నింపటమే గదా. అందుకని ఆయనగారు ముందు చూపుతోనే అలా రాసి ఉండవచ్చు.” అన్నాడు.

ఆ తర్వాత మేమిద్దరం అక్కడి కళాఖండాలను పరిశీలనగా చూసి ధన్యులం, సంస్కారులం కావటం అనే కార్యక్రమంలోకి దిగాం. ఓ చోట ‘గోల్డ్ మెడల్’ అనే లేబుల్ తగిలించి వుంది. కానీ, అక్కడ ఏ బొమ్మాలేదు. “ఇదేంటి సార్! ఈగోడకు గోల్డ్ మెడల్ ఇచ్చినట్లున్నారు?” అనడిగేడు. మా విలేఖర మిత్రుడు.

నేను చాలా జాగ్రత్తగా గోడను పరిశీలించేను. దానికి అక్కడక్కడా కొన్ని కన్నాలున్నాయి. కొద్దిగా సిమెంటు పెచ్చులు కూడా ఊడివున్నాయి. బహుశా ఆ కన్నాల్లో ఏదేనా గొప్ప అర్థం వుండి వుండవచ్చునని ఆలోచించసాగేను. ఎందుకంటే, లోగడ ఓ అంతరాతీయ చిత్రకళా ప్రదర్శనానికి హాజరయ్యేను. అందులో పేరు మోసిన ఓ ఇటాలియన్ ఆర్టిస్టు పెయింటింగ్ వుంది దాని ధర పదిహేనువేల రూపాయలు. ఎవరో బ్లాక్ మనీదండిగావున్న కళాభిమాని దానిని కొనేశాడు కూడా. ఆ పెయింటింగులో రంగులూలేవు, బొమ్మాలేదు. ఓ గోనెపట్టాకు ముప్ఫయ్యారు కన్నాలు పొడిచి, అందమైన ఫ్రేములో బిగించాడా ప్రపంచప్రఖ్యాత కళాకారుడు. అదేమి టంటే, గంటన్నర ఉపన్యాసం ఇచ్చి నోళ్ళు మూసేడు. ఈ గోడకూడా ఆ బాపతు కళాఖండమే గావచ్చు ననుపించింది.

నేనలా తలకాయను అన్ని విధాలావంచి ఆ గోడను పరిశోధిస్తూంటే ఓ కళాఖండం లాంటి పిల్ల వచ్చింది. "ఈ గోల్డ్ మెడల్ వచ్చింది నాకేనండీ!" అంది పరిచయం చేసు కుంటూ!

"అద్భుతం! ఈ కన్నాలు చెక్కటానికి మీరు చాలా శ్రమపడి ఉంటారు!" అన్నాడు మా విలేఖరుడు.

"కన్నాలేమిటి?" అందావిడ!

గోడను చూపించేన్నేను.

తెల్ల మొహం వేసి, ఆతర్వాత పైకి చూపించిందావిడ.

పైకప్పుకు ఓప్లాస్టిక్ ముక్క వ్రేలాడ దీసి ఉంది. "ఇదే నండి నా శిల్పం! దీనికే గోల్డ్ మెడల్ వచ్చింది. ఫోటోగానీ కావాలాండి!" అందావిడ బ్యాగ్ తెరుస్తూ.

మేమిద్దరం ఏడుపు ముఖాలు పెట్టాము. నావిలేఖర మిత్రుడు నా వంక కొరకొరా చూసేడు. నేను తమాయించు కున్నాను. "కామ్రేడ్! అలా చూడకు। కళ అంటేనే సృజ నాత్మక ప్రతిభామిశ్రితం అని అర్థం. నీ జన్మలో ఎన్నడేనా ఇలా వ్రేలాడ దీసిన ప్లాస్టిక్ ముక్కను చూశావా? ఇలా వ్రేలాడదీసి అకాడమీ గోల్డు మెడల్ సంపాదించ వచ్చని నీకు ఎన్నడేనా తట్టిందా? నీకూ నాకూ రాని అయిడియా ఈవిడకు వచ్చింది గనుకనే ఈవిడ నిజమైన కళాకారిణి।" అని ఉప న్యాసం ఇచ్చే న్నేను, నాఆర్ట్ క్రిటిక్ బిరుదాన్ని నిలబెట్టు కోవటం కోసం.

మా వాడు ఏమనుకున్నాడోగానీ, మారు పలకకుండా సదరు సుందరాంగి మృదుహస్తాలతో అందించిన ఆ ప్లాస్టిక్ ముక్క తాలూకు ఫోటో తీసుకుని థాంక్స్ చెప్పేడు.

ఈసారి "సిల్వర్ మెడల్" అనే లేబిల్ ఉన్న చోటికి చేరాం. అక్కడ బొమ్మ ఏదీలేదు గానీ పెద్ద పెద్ద మీసాలూ, జుట్టూ, చెంపలూ వగైరాలున్న ఓ దృఢకాయుడు మాత్రం వున్నాడు. అతని నెత్తిమీద గోడకు 'సిల్వర్ మెడల్' అనే లేబిల్ అతికించి వుంది.

మా విలేఖర మిత్రుడు ప్రశ్నార్థకంగా నావంక చూసేడు. మరుక్షణం నేను ఆర్టు క్రిటిక్‌ననే విషయం గుర్తుకొచ్చింది నాకు. "చూడు కామ్రేడ్! మన అకాడమీలు కళను కనిపెట్టి పైకి లాగటంలో ఆరితేరిన ఘటాలు. ప్లాస్టిక్ ముక్కలు వ్రేలాడదీసి నందుకు గోల్డు మెడల్ ఇవ్వగా లేనిది, మనిషినే తీసుకొచ్చి నిలబెడితే ఇవ్వకుండా ఎలాచెప్పు. అయినా ఈ వస్తాదుగారు సజీవ కళాఖండం గదా! ఆ మీసాలూ అవీ అలా కళాత్మకంగా పెంచాలంటే ఎంత టాలెంట్ ఉండాలో ఆలోచించు. ఈ కరువు రోజుల్లో ఆ కండలూ, దండలూ పెంచి పోషించాలంటే ఎంతఖర్చో ఆలోచించు" అన్నాన్నేను.

మా విలేఖరుడు ఆతన్నేదో అడగబోతూండగా ఇంతలో గైడ్ దయచేసేడు. "వీరు ప్రఖ్యాత శిల్పి దారాసింగ్‌గారు. సిల్వర్ మెడల్ వచ్చిన వీరి కళాఖండంలోని విశేషం ఏమంటే..." అంటూ క్రిందికి చూపించేడు.

ఆత్రంగా చూపిన మాకు నేలమీద సదరు దారాసింగ్ గారి కాళ్ల దగ్గర్లో ఓ రెండు చాక్‌పీసులు కనుపించేయి. వాటిముందు 'నా శిల్పం'శిల్పి దారాసింగ్ అనే లేబుల్‌వుంది.

మా విలేఖరుడు 'ఇదా! శిల్పమా! దీనికా! సిల్వర్ మెడలా?'అని గుండుదెబ్బ తిన్నవాడిలా బెదిరిపోతూ అడిగేడు.

దారాసింగ్ మా వంక కోపంగా చూసేడు. "మీరీ మధ్య ఢిల్లీలో జరిగిన ఇంటర్నేషనల్ ఆర్టు ఎగ్జిబిషను చూళ్లేదా? ఏంటి?" అని గర్జించేడు.

నాకు అర్థమయింది. అందులో అచ్చం ఇలాంటిదే ఓ చాక్‌పీస్ కళాఖండం ఉంది. ఓ ప్రపంచ ప్రఖ్యాత శిల్పిదది. అయితే మన కళాకారులు అంతర్జాతీయ స్థాయినందు కుంటున్నారన్న మాట.

అక్కడ్నుంచీ మరో ప్రైజు వచ్చిన పెయింటింగు దగ్గరకు వెళ్లాం. మా వాడు నేల మీదా, పైకప్పునా ఏదో వెతుకుతూంటే అర్థమై వాణ్ణి ఆపేను. "నాయనా, మన కెదురుగా వున్నదే కళాఖండం" అని వ్రేలితో గోడనున్న పెయింటింగును చూపించేను.

గైడు దయ చేసేడు. ఈ కళాఖండంలోవున్న విశేషం ఏమిటంటే చూడండి సార్, ఇక్కడ ఎద్దు తలకాయలా కనబడుతూందే, ఇది పికాసో చిన్నప్పుడు వేసిన ఎద్దు తలకాయలా లేదూ..." అంటూ వివరించుకు పోతుండగా ఓ బెల్‌బాటమ్ కళాకారుడు వచ్చి పడ్డాడు. "నాన్సెన్స్। అది ఎద్దు తలకాయ గాదు, గుర్రం తలకాయ।" అని సవరించేడు.

"నా తలకాయ పగిలి పోతోంది కామ్రేడ్।" అనినన్ను బయటకు లాక్కు పోయాడు మా విలేఖర మిత్రుడు.

( అక్టోబర్ 1974 )